పట్టుకు కేరాఫ్ చేనేపల్లి

- నాలుగేళ్ల క్రితం 200 ఎకరాల్లోనే మల్బరీ సాగు
- ప్రస్తుతం వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో పంట
- షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం భారీగా సబ్సిడీ
- మల్బరీ సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు


చేనేపల్లి వద్ద సాగు చేసిన మల్బరీ తోట


చేనేపల్లిలో ప్రభుత్వ సబ్సిడీతో నిర్మించిన రేషంషెడ్

చిలమత్తూరు: మండలంలోని చేనేపల్లి గ్రామం పట్టుకు కేరాఫ్‌గా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహంతో మల్బరీ సాగు విస్తీర్ణం కూడా భారీగా పెరిగింది. ధరలు హెచ్చుతగ్గులు ఉన్నా, నష్టం తక్కువగా ఉండటం, ఇతర పంటల్లో పెట్టుబడులు ఎక్కువగా ఉంటుండటంతో పట్టుపై రైతులు ఆసక్తి పెంచుకుంటున్నారు. దీనికి తోడు పట్టు పెంపకం కోసం ప్రభుత్వమే షెడ్లు నిర్మించి ఇస్తుండటం కలిసొచ్చే అంశంగా మారింది. దీంతో ఒకరిని చూసి మరొకరు మల్బరీ సాగుకు ముందుకు వస్తున్నారు.

ఎటు చూసినా మల్బరీ సాగు, షెడ్లే

చేనేపల్లిలో ఎటు చూసినా మల్బరీ తోటలు, షెడ్లే దర్శనమిస్తున్నాయి. గ్రామానికి ఆనుకునే కుషావతి నది ఉండటంతో నీటి సమస్య కూడా తక్కువ. మండలంలో షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం కూడా అధికారులకు లక్ష్యాలను నిర్దేశిస్తుండటంతో అధిక సంఖ్యలో రైతులు మల్బరీని సాగు చేసుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మండలంలో 35 షెడ్లను రైతులు సబ్సిడీపై నిర్మించుకున్నారు. పెద్ద షెడ్ నిర్మాణానికి రూ. 8 లక్షలు ఖర్చు అవుతుంది. ఇందులో రూ.6 లక్షలు రాష్ట్రప్రభుత్వం, ఉపాధి హామీ పథకం ద్వారా ఇస్తున్నారు. అలాగే చిన్న షెడ్‌కు రూ.6 లక్షలకు గాను రూ.5.20 లక్షలు సబ్సిడీ వస్తోంది.

200 నుంచి వెయ్యి ఎకరాలకు...

మండలంలో వెయ్యి ఎకరాల పైబడి మల్బరీ పంటను సాగు చేస్తున్నారు. మండలానికి 25 కి.మీ దూరంలోని హిందూపురంలో పట్టుగూళ్ల మార్కెట్ ఉండటంతో రైతులు మల్బరీ సాగుపై ఆసక్తి పెంచుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 200 ఎకరాల్లో మల్బరీ సాగు ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అందించిన ప్రోత్సాహకాల కారణంగా అది 1000 ఎకరాలకు పెరిగింది.

పెట్టుబడి తక్కువే...

మల్బరీ పంట నెల రోజుల్లో పూర్తి కావడం, పొలాల్లోనే షెడ్‌లను నిర్మించుకునే వెసులుబాటు కారణంగా రైతులు మల్బరీపై దృష్టిసారిస్తున్నారు. ప్రధానంగా సీబీ రకంను మెజారిటీ రైతులు తెచ్చుకుంటున్నారు. మట్టి కర్ణాటక ప్రాంతమైన డీ.క్రాస్ వంటి ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నారు. రేషం పురుగులు గూళ్లు చేసుకోవడానికి వాడే చందరింకులు కూడా బాడుగకు దొరుకుతుండగా ఒక్కొక్కటీ రూ.25 చెల్లిస్తున్నారు. ఎకరా మల్బరీ సాగుకు రూ.20 వేలు ఖర్చు అవుతుండగా .. ఎకరానికి 90 నుంచి 110 కేజీల దిగుబడి ఉంటుంది. ఈ లెక్కన ప్రస్తుత ధర ప్రకారం ఖర్చులు పోను రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకూ లాభం పొందుతున్నారు. మార్కెట్ సమీపంలోనే ఉండటంతో రవాణ చార్జీలు కూడా కలిసొస్తున్నాయి.


చేనేపల్లిలో గూళ్లు విడిపిస్తున్న మహిళా కూలీలు

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



మల్బరీ పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారం బాగుంది. ముఖ్యంగా సబ్సిడీలతో రేషం షెడ్ల నిర్మాణానికి సహకరిస్తోంది. ప్రభుత్వ సహకారం వల్లనే మా గ్రామంలో మల్బరీ సాగు విస్తీర్ణం పెరిగింది. జడి వస్తే నష్టాలు ఉంటాయి తప్ప సాధారణంగా ఎలాంటి ఇబ్బందీ లేదు.
– నరసింహారెడ్డి, చేనేపల్లి

లాభాలు బాగున్నాయి



మల్బరీ సాగులో నష్ట తీవ్రత తక్కువగా ఉంటుంది. పెట్టుబడి తక్కువగా ఉండటం వల్ల ఈ పంట సాగుచేస్తున్నా. పంట నెల రోజుల్లోపే పూర్తవుతుంది. అయితే మార్కెట్‌లో మంచి ధరలు ఉంటే మంచి లాభాలు వస్తాయి. ప్రభుత్వం ప్రోత్సాహకాలు బాగున్నాయి.
– శేషాద్రిరెడ్డి, చేనేపల్లి

మల్బరీ సాగు పెరిగింది

మండలంలో మల్బరీ సాగు వెయ్యి ఎకరాల పైబడే సాగవుతోంది. ప్రతి ఏడాదికీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం రేషం పురుగులు మేపునకు షెడ్లను నిర్మించి ఇస్తోంది. అధిక మొత్తంలో వారికి సబ్సిడీ అందుతోంది. రైతులు మల్బరీ సాగుపై మరింత దృష్టి సారిస్తే లాభాలు ఘడిస్తారు.
– రమణారెడ్డి, సెరికల్చర్ అధికారి, చిలమత్తూరు

క్లుప్తంగా

పథకాలు సద్వినియోగం చేసుకోండి


'వికసిత్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

రొద్దం: కేంద్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కలిపి గ్రామ పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కదిరమ్మ, వివిధ శాఖల అధికారులు, బీజేపీ మండలాధ్యక్షుడు నీరుగంటి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


ఈశ్వరప్ప (ఫైల్)

పరిగి: మండలంలోని పాత్రగానిపల్లిలో ఈశ్వరప్ప(48) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ నరేంద్ర వివరాల మేరకు... వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈశ్వరప్పకు గత కొంతకాలంగా అప్పుల బాధలు ఎక్కువగా ఉండేవి. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. తీవ్ర మనస్తాపంతో ఆయన మంగళవారం రాత్రి ఇంటికి రాలేదు. బుధవారం వేకువ జామున పొలాలవైపు వెళ్లిన స్థానికులకు ఈశ్వరప్ప ఉరి వేసుకున్న దృశ్యం కనిపించింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నరేంద్ర పరిశీలించారు. మృతుడు భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమ్మె విరమించిన పట్టు రీలర్లు

హిందూపురం అర్బన్: హిందూపురం పట్టు గూళ్ల మార్కెట్ ఎదురుగా తమకు రావాల్సిన ప్రోత్సాహక మొత్తం ఇవ్వాలంటూ రీలర్లు, రైతులు చేస్తున్న సమ్మెను ఎట్టకేలకు బుధవారం విరమించారు. గురువారం నుంచి యథావిధిగా మార్కెట్‌లో పట్టు గూళ్ల వేలం పాట, లావాదేవీలు జరుగుతాయని పట్టుగూళ్ల మార్కెట్ అధికారి లక్ష్మీరెడ్డి తెలిపారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం


పల్లకీలో ఊరేగుతున్న కార్తికేయుడు

పావగడ: స్థానిక నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యంస్వామి జాతరోత్సవాలను పురస్కరించుకుని శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి పల్లకీలో ఊరేగించారు. బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో నిర్వహించిన పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

దీపికను కలసిన నూతన కమిటీ


వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

హిందూపురం అర్బన్: లేపాక్షి దుర్గా పాపనేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా రామానందస్వామి, కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం వారు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మధుమతిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

చిలమత్తూరు: కర్ణాటక మద్యం అక్రమ రవాణా చేస్తున్న నలుగురిపై చిలమత్తూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ గంగాధర్ వివరాలు వెల్లడించారు. బుధవారం కొడికొండ చెక్‌పోస్ట్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా టాటాఏస్ వాహనంతో పాటు రెండు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తుండగా 972 మద్యం ప్యాకెట్లు, బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురి అదుపులోకి తీసుకొని అందులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. రెండు ద్విచక్ర వాహనాలతో పాటు టాటాఏస్ వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి


వైఎస్సార్‌సీపీ నాయకులను కలసిన ఈర లక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్‌ఎల్ ఈర లక్కప్ప బుధవారం కలిశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

మడకశిర: మడకశిరలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గురువారం ఉదయం 10.30 గంటలకు జరిగే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాధమ్మ, ఎంపీడీఓ రామారావు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలన్నారు. అలాగే మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతితో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకూ దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం కోసం రెంటింటికీ కలిపి ఎస్సీకి 70, ఎస్టీ 5, బీసీ 4, ఓసీ 1, సీట్ల చొప్పున కేటాయించామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

కుల గణన వేగవంతం చేయండి

అగళి: మండలంలో కుల గణన సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ రవిప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలని సూచించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేసీ అభిషేక్ కుమార్


పెనుకొండలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

హిందూపురం టౌన్: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికే 'ఆడుదాం ఆంధ్ర' పోటీలను నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, పలు సూచనలు చేశారు. జేసీ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడా ఆణిముత్యాలను గుర్తించి వారిని దేశానికి అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడ పోటీలను ప్రారంభించారని చెప్పారు. క్రీడలను స్నేహపూర్వకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. గెలుపోటములు సహజమన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాట్మింటన్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, ఎంఈఓ వెంకటరమణ, డీఈఈ వాణి, ఆడుదాం ఆంధ్రా జిల్లా ఇన్‌చార్జ్ మొరార్జీ యాదవ్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు శివకుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ లోకనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం నియోజకవర్గ స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ ప్రారంభించారు. సమావేశంలో పీఈటీలు, ఉపాధ్యాయు, ఎంపీడీఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం: ఆడుదాం ఆంధ్రాలో పోటీల్లో భాగంగా డివిజన్‌స్థాయి పోటీల్లోనూ కలిపి సచివాయల పరిధిలోని క్రీడాకారురులు సత్తాచాటారు. ఖోఖో పోటీలో రొద్దం– పరిగి జట్లు తలపడగా రొద్దం ఘన విజయం సాధించినట్లు పంచాయతీ కార్యదర్శులు సుధకార్‌రెడ్డి, మోహన్‌రాజ్ తెలిపారు.

జగనన్నే మళ్లీ సీఎం

- మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: రానున్న సార్వత్రిక ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి మధ్య జరగబోతున్నాయి. ఎల్లో పార్టీలు, పత్రికలు ఓ వైపు... ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మరోవైపు నిలబడుతున్నారు. ఎవరు ఎవరెవరితో జతకట్టినా వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయం' అని మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. గత నాలుగు రోజులుగా మండలంలో మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీక పలకరింపు యాత్ర బుధవారంతో ముగిసింది. మంత్రితో పాటూ వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ పాల్గొన్నారు. మోదా పంచాయతీ పరిధిలోని కోనాపురంలో యాత్ర మొదలైంది. పుట్టగూర్లపల్లి, చెర్లోపల్లి, మోదా, ఆనందపాళ్యం, బందార్లపల్లి, గొరవనహళ్లి, శ్రీరంగరాజుపల్లి, ముల్లమోతుకపల్లి, పాపిరెడ్డిపల్లి, బోరెడ్డిపల్లి, చిన్నపల్లి గ్రామాల్లో కొనసాగించి, పరిగి మండల కేంద్రంలో యాత్ర ముగిసింది. అన్ని ప్రాంతాల్లోనూ జనం భారీగా పాల్గొనడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది.

అర్హులందరికీ న్యాయం

గడిచిన టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క పథకం కావాలన్నా జన్మభూమి కమిటీ సిఫార్సు లేనిదే అందేది కాదని మంత్రి ఉషశ్రీచరణ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటూ మహిళా సాధికారతకు పెద్దపీట వేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. పేదలకు న్యాయం చేస్తుంటే గిట్టని టీడీపీ శ్రేణులు, పచ్చ పత్రికలు ప్రభుత్వంపై బురదజల్లే పనిలో పడ్డాయన్నారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబుతో పచ్చ పత్రికలతో పాటూ దత్తపుత్రుడు జతకట్టాడని...కానీ జగనన్న మాత్రం ప్రజలే స్టార్ క్యాంపెయినర్స్‌గా భావిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.


పరిగి: మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్, చిత్రంలో ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్ పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త అభ్యర్థి బోయ శాంతమ్మ తెలిపారు. పదవులతో పాటూ నామినేటెడ్ పోస్టులను అధిక శాతం బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించడంతో పాటూ అణగారిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను కొనసాగించాలంటే అది వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఏఒక్క పథకాన్ని కొనసాగించబోరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభు, సింగల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, వైస్ ఎంపీపీ వేదవతి నరసింహారెడ్డి, సర్పంచులు అరుణ, మల్లక్క, లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప, ఎంపీటీసీలు అంజినప్ప, నారాయణరెడ్డి, శకుంతలమ్మ, సునిత, లక్ష్మీ, లింగమ్మ, కోఆప్షన్ మెంబర్ సలీం, ముఖ్య నాయకులు సింగారెడ్డి, చంటి, జయరాం, శివశంకర్, కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి, నాగబూషణరెడ్డి, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రభుత్వ ఉద్యోగుల హిందూపురం తాలూకా కార్యవర్గ సభ్యులు

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం హిందూపురం తాలుకా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో తాలూకా అధ్యక్షుడిగా రవీంద్రారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా జగదీష్, ఉపాధ్యక్షులుగా వెంకటరమణ, మల్లప్ప, కిరణ్‌కుమార్, రమేష్ బాబు, రియాజ్, లక్ష్మీదేవి, షాకీర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా వన్నప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శ్రీనివాస రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా సుధాకర్, శ్రీరాములు, అరుణ, నరసింహులు, గిరిజమ్మ, మంజునాథ్, రాఘవేంద్ర, ట్రెజరర్‌గా ప్రభాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం బూత్ లెవెల్ అధికారులతో తహసీల్దార్ హసీనాసుల్తానా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని అన్ని బూత్ కేంద్రాల్లో ఓటరు జాబితాను ప్రదర్శించాలన్నారు. అలాగే ఓటు హక్కు ఏవిధంగా వినియోగించుకోవాలన్న విషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ భాగ్యలక్ష్మీ, బూత్‌లెవెల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

సాక్షిబృందం: ఆడపిల్లలను చదివించడం.. రక్షించుకోవడం అందరి బాధ్యతని వక్తలు తెలిపారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అన్ని ప్రాంతాల్లోనూ బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. వక్తలు కిశోర బాలికలకు పోషణ, ఆరోగ్య విద్య, హక్కులు, చట్టాల గురించి అవగాహన కల్పించారు.


మడకశిరలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థినులు


హిందూపురం: విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సీడీపీఓ రెడ్డి రమణమ్మ


రొద్దం: ఆర్ మరువపల్లిలో బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

అన్ని సౌకర్యాలు కల్పించాలి


సౌకర్యాలు అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్

రొద్దం: మండలంలోని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే పాఠశాలలను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ బుధవారం పరిశీలించారు. ఎం కొత్తపల్లి, నారనాగేపల్లి, తాడంగిపల్లి, గౌరాజుపల్లి, పెద్దకోడిపల్లి, రొద్దకంపల్లి, తురకలాపట్నం, పాతర్లపల్లి, ఆర్ మరువపల్లి, రొద్దం తదితర పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసే పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ అనంతచారిని ఆదేశించారు.

నాగలమడక ఆలయ అభివృద్ధికి కృషి


మహిళకు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

పావగడ: నాగలమడక సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ తెలిపారు. త్వరలోనే ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభిస్తామన్నారు. నాగలమడక దేవాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన జన సందర్శన సభలో ఆయన మాట్లాడారు. అర్చకుల మధ్య నెల కొన్న గ్రూపు తగాదాలతోనే ఆలయ అభివృద్ధి కుంటు పడుతోందని అసహనం వ్యక్తం చేశారు. త్వరలోనే ఆలయ కొత్త కమిటీని ఏర్పాటు చేసి నిధులు సమీకరించి ఆలయ నవీకరణకు పాటు పడతామన్నారు. అంతకు ముందు ర్యాపిట గ్రామం లో నిర్వహించిన జన సందర్శన సభలో మాట్లాడారు. ఆసియాలోనే అతి పెద్ద తిరుమణి సోలార్ పార్క్‌ను మరో 10 వేల ఎకరాల భూమితో విస్తరించి మరో 1500 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పాదనకు త్వరలోనే శ్రీకారం చుడతామన్నారు.

నేటి నుంచి కరియమ్మ, దొడగాటమ్మ ఉత్సవాలు

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ పొలి మేరలో వెలసిన దొడగాటమ్మ , కరియమ్మ ఉత్సవాలు గురు, శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గురుదేవప్ప తెలిపారు.

సమగ్ర వివరాల నమోదుపై శిక్షణ

రొళ్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం సూక్ష్మ ప్రణాళికలో భాగంగా విద్యార్థుల సమగ్ర వివరాల నమోదుపై ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలకు ఎంఈఓ శ్రీధర్ ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

కులాన్ని రాజకీయ పార్టీలకు ఆపాదించొద్దు


మాట్లాడుతున్న వాల్మీకి సంఘు పెద్దలు, అడహక్ కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: వాల్మీకి కుల సంఘాన్ని రాజకీయ పార్టీలకు ఆపాదిస్తూ కులంలో చిచ్చు పెడుతున్నారని వాల్మీకి సంఘం అపధర్మ అధ్యక్షుడు ఆదినారాయణ, అడహక్ కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం స్థానిక వాల్మీకి సంఘ పెద్దలు, అడహక్ కమిటీ సభ్యులు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా దాతల సహకారంతో వాల్మీకి కల్యాణ మండపం నిర్మాణం చేపట్టామన్నారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావు లేదన్నారు. వాల్మీకి ఆలయ నిర్మాణం కోసం వాల్మీకి మహాసభ తీర్మానంతో నూతన కమిటీ ఎన్నిక జరిగే వరకూ అడహక్ కమిటీను ఏర్పాటు చేసుకున్నామన్నారు. అడహక్ కమిటీ ద్వారా ఆలయ నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాల్మీకి సంఘం నూతన ఎన్నిక జరిగే వరకే అపధర్మ అధ్యక్షుడిగా ఆదినారాయణ, అడహక్ కమిటీ కొనసాగుతుందని నిర్ణయించామన్నారు. ఈ నేపథ్యంలోనే ఆలయ కమిటీని అడహక్ కమిటీ రద్దు చేసినట్లు చెప్పారు. అయితే వాల్మీకి ఆలయ నిర్మాణం పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులను కాజేశారని ఆరోపించారు. వాటి లెక్కలను చూపాలన్నారు.